సాక్షి
బాపట్ల
గురువారం । 27 । జూన్ । 2024



అంకమ్మతల్లి ఆలయంలో పూజలు

యడ్లపాడు: యడ్లపాడు కాటి అంకమ్మతల్లి గుడిలో బుధవారం ఎన్‌డీఏ కూటమి నేతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 516 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.



విత్తన దుకాణాల తనిఖీ

కాకుమాను: కాకుమానులోని పలు విత్తన విక్రయ దుకాణాలను బుధవారం ఏఓ కె.కిరణ్మయి తనిఖీ చేశారు. స్టాకు వివరాలు, లైసెన్సులు పరిశీలించారు.

పంచముఖ ఆంజనేయునికి ప్రత్యేక పూజలు



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 20వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

మహంకాళీ అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు



తాడేపల్లి రూరల్ : కంతంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థాన హుండీ లెక్కింపును బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.సీహెచ్. వెంకటరెడ్డి మాట్లాడుతూ హుండీ కానుకల లెక్కింపు గుంటూరు దేవదాయ శాఖ, ఆంజనేయస్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె. వీరాంజనేయులు, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త డి.రంగప్రసాద్ పర్యవేక్షణలో జరిగిందని తెలిపారు. అమ్మవారికి రూ.12,10,467 వచ్చిందని వివరించారు. మార్చిలో రూ. 11,51,564 వచ్చిందన్నారు. గతంలో కన్నా ప్రస్తుతం రూ. 58,903 ఆదాయం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ ధనాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని వివరించారు.

ఐదు మండలాల్లో వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మంగళగిరి మండలంలో 10.8 మిల్లీ మీటర్లు, ప్రత్తిపాడు 6.2, తెనాలి 1.4, పొన్నూరు 0.8, తాడేపల్లి మండలంలో 0.6 మి.మీ. చొప్పున వర్షం పడింది.

యార్డులో 47,926 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 44,834 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 47,926 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 20,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 19,600 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 16,301 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

30న చేతిరాత నైపుణ్యంలో శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఈనెల 30న చేతిరాత నైపుణ్యంలో ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చేతిరాత ఉద్యమంలో భాగంగా 3,545 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులతోపాటు 37వేల మందికిపైగా విద్యార్థుల చేతిరాతను అందంగా తీర్చిదిద్దిన క్యాలీగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో పాల్గొనేందుకు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 91820 53084 (వై.నాగమణి), 99122 20671 (శారద), 99590 85005 (ఈ.అనిల్), 98495 44892 (వి.రామమోహనరావు) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

29న జాతీయ లోక్ అదాలత్

మాచర్ల: రాష్ట్ర న్యాయసేవా సాధికార సంస్థ హైకోర్టు, జిల్లా కోర్టు ఆదేశాల మేరకు ఈనెల 29న మాచర్ల సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని మాచర్ల న్యాయసేవా సాధికార సంస్థ చైర్మన్, సివిల్ జడ్జి శ్రీనివాస్ కల్యాణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, సివిల్, మనోవర్తి, చెక్‌బౌన్స్, బ్యాంకులకు సంబంధించిన, రెవెన్యూ, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మాచర్ల పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సివిల్ జడ్జి శ్రీనివాస్ కల్యాణ్ సూచించారు.

నేటి నుంచి ఈ-సెట్ కౌన్సెలింగ్

- 30 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు అవకాశం
- ఆన్‌లైన్‌లోనే విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన
- తప్పులుంటేనే కౌన్సెలింగ్ కేంద్రానికి రావాలి
- గుంటూరు జిల్లాలో ఒక హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు
- జూలై ఒకటి నుంచి కళాశాలల ఎంపిక కోసం వెబ్ కౌన్సెలింగ్



విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ విద్యార్హతతో బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం కోసం ఉద్దేశించిన ఏపీ ఈసెట్-2024 కౌన్సెలింగ్ గురువారం ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఈ-సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు బుధవారం ప్రారంభమైన ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 30 వరకు కొనసాగనుంది. ఏపీఈసెట్-2024లో అర్హత సాధించి, కళాశాలల్లో చేరేందుకు ఎదురుచూస్తున్న విద్యార్థులు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. విద్యార్థులెవ్వరూ భౌతికంగా హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన విద్యార్థుల ధ్రువపత్రాలు మరుసటి రోజున సంబంధిత హెల్ప్‌లైన్ కేంద్రాలకు ఆన్‌లైన్‌లో చేరతాయి. సంబంధిత హెల్ప్‌లైన్ కేంద్రంలోని అధికారులు విద్యార్థులు అప్లోడ్ చేసిన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే పరిశీలించి, ఆమోదిస్తారు. ధ్రువపత్రాల పరిశీలన అసంపూర్తిగా ఉన్న విద్యార్థులకే హెల్ప్‌లైన్ కేంద్రంలో భౌతికంగా సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు జూలై 1,2,3,4వ తేదీల్లో ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలల ఎంపికకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపుతో మొదలయ్యే ప్రక్రియ

- ఏపీ ఈసెట్-2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపుతో పాటు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. సెట్స్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా ఈసెట్-2024కు లాగిన్ అయ్యి ఈసెట్ హాల్ టికెట్, జనన తేదీ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ సమయంలో ప్రాసెసింగ్ ఫీజు రూపంలో ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.600 చొప్పున ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలి.
- ఏపీ ఈసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు హెల్ప్‌లైన్ కేంద్రాలకు విధిగా వెళ్లాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈసెట్‌కు దరఖాస్తు చేసే సమయంలోనే విద్యార్థులు సమర్పించిన టెన్త్, పాలిటెక్నిక్ మార్కుల జాబితాలు, సామాజికవర్గ, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను సాంకేతిక విద్యాశాఖ వెబ్ బేస్డ్ విధానంలో పూర్తిచేసింది.
- ఈసెట్ రిజిస్ట్రేషన్ సమయంలో హాల్ టికెట్ నంబరు, జననతేదీ వివరాలను సబ్మిట్ చేసిన విద్యార్థుల ధ్రువపత్రాలకు సంబంధించిన వివరాలు కంప్యూటర్ స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతాయి. ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన విజయవంతంగా పూర్తయిందని డిస్‌ప్లేలో ప్రత్యక్షమైతే, సంబంధిత విద్యార్థులు షెడ్యూల్ ప్రకారం నేరుగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి.
- క్యాండిడేట్ ఈజ్ నాట్ ఎలిజిబుల్ ఫర్ ఎక్సర్‌సైజ్ ఆప్షన్స్ అని వస్తే, సంబంధిత ధ్రువపత్రాలతో హెల్ప్‌లైన్ కేంద్రంలో పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుంది.
- సర్టిఫికెట్ వెరిఫికేషన్ పురోగతిలో ఉన్నట్లు డిస్‌ప్లే అయిన పక్షంలో విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధంగా ఉండాల్సి ఉంది.
- విద్యార్థులకు సహాయమందించేందుకు గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

డ్రగ్స్ రహిత సమాజమే అందరి లక్ష్యం

ఎస్పీ వకుల్ జిందాల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

చీరాల అర్బన్: డ్రగ్స్ రహిత సమాజం కోసం అంతా కృషి చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. వేటపాలెం మండలం కొత్తపేటలోని రావి సుబ్బారాయుడు, జయలక్ష్మి కల్యాణ మండపంలో బాపట్ల జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ మాదక ద్రవ్యాల నిషేధంపై సమాజంలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. తెలిసీ తెలియని వయస్సులో డ్రగ్స్‌కు ఒక్కసారి అలవాటు పడితే జీవితం సర్వనాశనం అవుతుందని తెలిపారు. డ్రగ్స్‌పై నమోదు చేసే కేసులు కఠినంగా ఉంటాయని, ఈఎన్‌డీపీఎస్ యాక్ట్ ద్వారా 20 ఏళ్ల వరకు కఠిన శిక్షలుంటాయని హెచ్చరించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల శరీరంలో ప్రధాన అవయవాలన్నీ దెబ్బతిని ఆరోగ్యం కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. మాదక ద్రవ్యాలు యువత పాలిట మరణ శాసనాలుగా మారతాయని హెచ్చరించారు. మరోవైపు సమాజంలో చిన్నచూపు, అవమానాలు, డ్రగ్స్ తీసుకునే కుటుంబానికి ఎదురవుతాయని గుర్తు చేశారు. విద్యార్థులంతా ఈ విషయాన్ని గుర్తించి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. వాటిని వినియోగించబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐలు బి.శేషగిరిరావు, సోమశేఖర్, ఎస్ఐలు శ్రీకాంత్, ఇమ్మానియేలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తింపులేని మిరప విత్తనాలు స్వాధీనం

- యడ్లపాడు, నాదెండ్ల మండలాల్లో గుంటూరు రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు
- రెండు షాపుల్లో రూ.4,78,953 విలువైన మిరప విత్తనాలు గుర్తింపు



యడ్లపాడులోని ఓ విత్తన దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

యడ్లపాడు: గుంటూరు రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బృందం నేతృత్వంలో పలు విత్తనాల విక్రయ దుకాణాల్లో బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు యడ్లపాడు, నాదెండ్ల మండలాల్లో అనుమతులు లేని విత్తనాలను విక్రయిస్తున్నారనే సమాచారంతో ఈ దాడులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో ఆయా మండలాల వ్యవసాయ అధికారులతో కలిసి విస్తృత సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో యడ్లపాడు, నాదెండ్ల మండల కేంద్రాల్లోని రెండు షాపుల్లో అనుమతి పత్రాలు లేని రూ.4,78,953 విలువైన ఐదు కేజీల ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. అత్యధికంగా యడ్లపాడు శ్రీసాయినాథ సీడ్స్‌షాపులో రూ.4,31,703 విలువ గల హైబ్రీడ్ మిరప విత్తనాలు, నాదెండ్లలో శ్రీహర్ష సీడ్స్ షాపులో రూ.47,250 విలువైన హైబ్రీడ్ మిరప విత్తనాల నిల్వల్ని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. 1983 సీడ్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం వాటి విక్రయాలను నిలుపుదల చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి కె.రమణకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, రెండు మండలాల ఏఓలు సీహెచ్ సరిత, హరిప్రసాద్ పాల్గొన్నారు.

చెత్త ట్రాక్టర్‌లో అనాథ మృతదేహం తరలింపు



బాపట్ల: అనాథ మృతదేహాల్ని తరలించడంలో బాపట్ల మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో వీటి కోసం ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దాన్ని మూలన పడేశారు. బాపట్ల ప్రభుత్వ వైద్యశాల నుంచి బుధవారం ఓ అనాథ మృతదేహాన్ని పురపాలక సంఘ ట్రాక్టర్‌లో తరలించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనం ఏమైందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

డయేరియాను పూర్తిస్థాయిలో అరికట్టాలి

ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

బాపట్ల: డయేరియాను పూర్తిస్థాయిలో అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సీహెచ్. శ్రీధర్ ఆదేశించారు. డయేరియా నిర్మూలనపై మండల స్థాయి అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించడంతోనే వ్యాధిని నిర్మూలించగలమని తెలిపారు. రాష్ట్రంలో ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా సోకి ప్రతి ఏటా 5. 8 శాతం మృతి చెందుతున్నారని వివరించారు. గతేడాది జిల్లాలో 175 కేసులు నమోదయ్యాయన్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో డయేరియా మరణాల్ని పూర్తిస్థాయిలో అరికట్టాలని ఆదేశించారు. జిల్లాలో 1.16 లక్షల మంది చిన్నారులు ఉన్నారని, వీరి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఇంటింటికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేయాలని చెప్పారు. జూలై 1 నుంచి ఆగస్టు చివరి వరకు డయేరియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. అన్ని గ్రామాల్లో జూలై 15 నుంచి ఆగస్టు 16 వరకు ఆరోగ్య సమితి సమావేశాలు జరపాలని తెలిపారు. శివారు కాలనీలలో వైద్య శిబిరాలతో పాటు గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరఫరా చేసే నీటిని ఎప్పటికప్పుడు పరీక్షించాలని చెప్పారు. చెరువులతో పాటు నీటి ట్యాంకుల్ని శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. వర్షాకాలంలో చెరువులు కలుషితమయ్యే అవకాశం ఉందని, నీటి శుద్ధి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనుబంధశాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, డీపీవో రవికుమార్, ఎస్ఈ విద్యాసాగర్, మహిళ, శిశు సంక్షేమశాఖ పీడీ ఉమ పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులకు మేలు



కేసానుపల్లిలో సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేస్తున్న డీఏఓ

డీఏఓ ఐ.మురళి

నరసరావుపేట రూరల్: పంట సాగు హక్కు పత్రాలతో(సీసీఆర్‌సీ) కౌలు రైతులకు మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని కేసానుపల్లిలో బుధవారం భూ యజమానులు, కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఏఓ మురళి పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. కౌలు రైతులు పంటసాగు హక్కు పత్రాల కోసం వ్యవసాయ సహాయకుడిని, గ్రామ రెవెన్యూ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాన్ని అందజేస్తారని తెలిపారు. పంట సాగు హక్కు పత్రం కేవలం 11 నెలలు మాత్రమే కౌలు రైతులకు ఉపయోగపడుతుందన్నారు. భూ యజమానులకు వారి హక్కులపై ఎలాంటి భంగం వాటిల్లదని స్పష్టం చేశారు. సీసీఆర్‌సీ కార్డుల ద్వారా పంట నమోదు చేసుకున్న రైతులకు పంటల బీమా వర్తిస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే పంట నష్ట పరిహారం పొందవచ్చని తెలిపారు. పంట ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించేందుకు సీసీఆర్‌సీ కార్డు ఉపయోగపడుతుందన్నారు. ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను ఐదు శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కౌలు రైతులు జాయింట్ లయబిలిటీ గ్రూప్(జేఎల్‌జీ)గా ఏర్పడితే బ్యాంకుల నుంచి రుణాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ నరేంద్రబాబు, ఏఈఓ కె.బ్రహ్మయ్య, వీఏఓ షేక్ సాయిబాబు, వీఆర్ఓ కె.రత్నకుమారి, కౌలు రైతు సంఘం నాయకులు కామినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి పరిశీలనకు
అకడమిక్ మానిటరింగ్ బృందాలు

గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి శైలజ



లలిత ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈఓ శైలజ, డీవైఈఓ వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల గుణాత్మక ప్రగతిని పరిశీలించేందుకు జిల్లా ఉమ్మడి పరీక్షా మండలి (డీసీఈబీ) సహకారంతో అకడమిక్ మానిటరింగ్ బృందాల్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ చెప్పారు. బుధవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో ఆమె అధ్యక్షతన డీసీఈబీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. డీఈఓ శైలజ మాట్లాడుతూ మండలస్థాయిలో ఏర్పాటు చేయనున్న అకడమిక్ మానిటరింగ్ బృందాలు నెలలో రెండుసార్లు సంబంధిత మండలంలోని పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల ప్రగతిని అంచనా వేయాలని సూచించారు. ఆయా బృందాల పరిశీలన నివేదికను ప్రతినెలా సంబంధిత పర్యవేక్షక అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలల్లో డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతతో పాటు సురక్షిత నీటిని అందించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించేలా ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలలు చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరు డీవైఈఓ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అకడమిక్ మానిటరింగ్ బృందాలకు పాఠశాలల సందర్శనలో సహకారాన్ని అందిస్తామని తెలిపారు. డీసీఈబీ కార్యదర్శి ఎ.తిరుమలేష్ మాట్లాడుతూ అకడమిక్ మానిటరింగ్ బృందాలు జిల్లాలో పాఠశాల విద్య పురోగతికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పూర్వ కార్యదర్శి జి. లలిత ప్రసాద్ ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల విభాగ జిల్లా సహాయ కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీసీఈబీ కార్యవర్గ సభ్యులు, పలువురు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అనుమానమే పెనుభూతమై..

గొంతు నులిమి భార్యను హతమార్చిన భర్త



మృతురాలు సాయిభవాని

చిలకలూరిపేట: అనుమానమే పెనుభూతమై కట్టుకున్న భార్యను భర్త గొంతునులిమి హత్య చేసిన ఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మేడా సాయిభవాని(19) భర్త కనపర్తి సురేష్‌తో కలసి పట్టణానికి మంచినీరు సరఫరా చేసే చెరువుల మార్గంలో ఉన్న టిడ్కో గృహ సముదాయంలో ఉంటోంది. ఆమెకు మొదట నాలుగేళ్ల కిందట మీసాల పృథ్వీతో వివాహం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో విడాకులు తీసుకున్నారు. అనంతరం ఏడాది కిందట కనపర్తి సురేష్‌ను రెండో వివాహం చేసుకుంది. ఈ నేపథ్యంలో సురేష్ గత కొంత కాలంగా సాయిభవాని తన మొదటి భర్తతో ఫోన్‌లో మాట్లాడుతుంది అంటూ అనుమానం వ్యక్తం చేస్తూ వేధించసాగాడు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రాత్రి మాట్లాడాలని చెప్పి భార్యను టిడ్కో గృహ సముదాయానికి దూరంగా పొలాల్లోకి తీసుకువెళ్లి గొంతునులిమి హతమార్చాడు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన అనంతరం నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 504.20 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటి మట్టం 815.10 అడుగుల వద్ద ఉంది.



అందుబాటులో ఎల్‌సీఏ 643 మిరప విత్తనాలు

నరసరావుపేట: గుంటూరు లాం ఫామ్ ఉద్యాన పరిశోధనా కేంద్రంలో అభివృద్ధి చేసిన ఎల్‌సీఏ 643 రకం మిరప విత్తనాలు అమ్మకానికి అందుబాటులో ఉన్నట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గిరిధర్ తెలియచేసినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి సీహెచ్.వి.రమణారెడ్డి బుధవారం పేర్కొన్నారు. వీటి ధర కిలో రూ.1200 అన్నారు. ఇది బైడిగి రకాన్ని పోలి ఉండే సూటి రకమని, నల్లతామర, బొబ్బర పురుగులను తట్టుకునే గుణం ఈ రకానికి ఉందని తెలిపారు. జిల్లా రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, ఇతర వివరాలకు 73826 33661 సంప్రదించాలని కోరారు.


క్లుప్తంగా

పవర్ లిఫ్టర్ ఖాజావలికి అభినందన



చీరాల టౌన్: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించి, చీరాల ఖ్యాతిని చాటిన లిఫ్టర్ ఎస్‌డీ ఖాజావలి క్రీడాకారులకు ఆదర్శనీయమని బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ తాడివలస దేవరాజ్ అన్నారు. ఇటీవల పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలలో జరిగిన జాతీయ పోటీల్లో వివిధ విభాగాల్లో చక్కని ప్రతిభచూపి రెండు బంగారు, రెండు వెండి పతకాలు సాధించిన ఖాజావలిని బుధవారం బాపట్ల జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లకు చీరాల నెలవని, పలువురు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో అనేక పతకాలు సాధించారని పేర్కొన్నారు. ఆగస్టులో యూరప్‌లో జరగనున్న అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఖాజావలి ఎంపికవ్వడం చీరాలకే గర్వకారణమని తెలిపారు. అంతర్జాతీయ పోటీల్లో చక్కని ప్రతిభ చూపి పతకాలు సాధించి భారతదేశానికి, చీరాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఖాజావలికి తన వంతుగా సహకారాన్ని అందిస్తున్నానని, జిల్లాలోని ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం..కడప మ్యాచ్ డ్రా



4 వికెట్లు తీసిన కడప జట్టు బౌలర్ గైలు

మంగళగిరి: అమరావతి క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ అండర్‌-16 మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలలో కడప-శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రా అయింది. బుధవారం జరిగిన రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేపట్టిన శ్రీకాకుళం జట్టు 72 ఓవర్లలో 100 పరుగులు చేసి ఆలౌటైంది. జట్టు బ్యాట్స్‌మేన్ కె.చరిత్ 39 పరుగులు చేశాడు. కడప జట్టు బౌలర్ జి.గైలు నాలుగు వికెట్లు తీసి శ్రీకాకుళం జట్టును కట్టడి చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కడప జట్టు రెండు ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి తొమ్మిది పరుగులు చేసింది. సమయం ముగియడంతో మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీకాకుళం జట్టు ఆధిక్యత సాధించింది. ఓవరాల్‌గా శ్రీకాకుళం జట్టు 113.2 ఓవర్లలో 240 పరుగులు చేసి ఆలౌట్ కాగా కడప జట్టు 63 ఓవర్లలో 210 పరుగులు చేసి ఆలౌటైంది.

సింథైట్ ఫ్యాక్టరీ దారి మూసివేత



ఫ్యాక్టరీ రోడ్డులో తీసిన గొయ్యి



ఫ్యాక్టరీని మూసి వేసినట్లు గోడకు అంటించిన నోటీసు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల తమ్మవరం రోడ్డుకు సమీపంలో గల సింథైట్ కారం ఫ్యాక్టరీకి వెళ్లే దారిలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు గొయ్యితీసి మూసివేశారు. దీనిపై ఫ్యాక్టరీ జీఎం మహేంద్రను వివరణ అడగ్గా.. ఫ్యాక్టరీ ప్రశాంత వాతావరణంలో ఉంటేనే కొనసాగించగలమని, లేనిపక్షంలో మూసి వేయడం తప్పా ఏమీ చేయలేమని తెలిపారు. కొంతమంది వ్యక్తులు రాజకీయ నాటకంలో భాగంగా ఫ్యాక్టరీని కొనసాగించేందుకు అడ్డు తగిలారని, ఈ సమయంలో కొనసాగించలేమని చెప్పారు. ఈ ఏడాది ఫ్యాక్టరీని మూసివేస్తామని, అందులో భాగంగానే గేటుకు నోటీసు అంటించామని జీఎం తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి ఫ్యాక్టరీ ద్వారా కారం కోరు వస్తోందని, తమ ప్రాణాలకు హాని కలుగుతుందని గ్రామస్తులు కొందరు ఆందోళన చేస్తున్న సంగతి పాఠకులకు తెలిసిందే.

వానకు ముందు విత్తుతోనే రైతుకు లాభం

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జి.అమలకుమారి



మాట్లాడుతున్న రీజినల్ కో-ఆర్డినేటర్ ఎన్.వెంకట్రావు, పాల్గొన్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: వానకు ముందే విత్తడం వల్ల భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జి.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్ రీజినల్ కో-ఆర్డినేటర్ ఎన్.వెంకట్రావు, డీపీఎం అమలకుమారి సమావేశంలో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రసాయన ఎరువులు, పురుగు మందులపై పెట్టుబడిని పూర్తిగా తగ్గించుకోవచ్చని సూచించారు. ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విత్తనాల కిట్స్‌లో 30 రకాలను 15 కేజీల కిట్లుగా తయారుచేసి గ్రామాల్లో సిబ్బంది వద్ద అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. పప్పు దినుసులు, చిరు ధాన్యాలు, నూనెగింజలు, ఆకు కూరలు, తీగజాతి, సుగంధ ద్రవ్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు ఈ కిట్‌లో ఉంటాయని తెలిపారు. వానకు ముందే విత్తనాలు వేసుకోవడం ద్వారా కలుపు నివారించడంతో పాటు ఆకు కూరలు తీసుకోవచ్చని తెలిపారు. పశువుల మేతగా ఉపయోగించుకోవచ్చని, మిగిలినవి భూమిలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని తెలిపారు. కాంపాక్ట్ బ్లాక్‌లు ఏర్పాటుచేసి రసాయనాలు లేని సాగుకు రైతులను ప్రోత్సహించాలని వారు సిబ్బందికి తెలియజేశారు. సమావేశంలో అడిషనల్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమ్‌రాజ్, ఎన్ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయంలో కొత్త టీచర్లకు శిక్షణ

గుంటూరు రూరల్: పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం ఒంగోలు క్లస్టర్‌లో నూతనంగా విధుల్లో చేరిన 45 మంది ఉపాధ్యాయులకు గత ఐదు రోజులుగా బోధన తదితర అంశాలపై శిక్షణ, అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. నల్లపాడు గ్రామంలోని కేంద్రీయ విద్యాలయంలో బుధవారం నిర్వహించిన ఓరియంటేషన్ చివరి రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాఠశాల ప్రిన్సిపల్, కోర్స్ డైరెక్టర్ హనీమెహత మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ సులభతర పద్ధతిలో బోధన అందించాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ టి. లక్ష్మి, ఉపాధ్యాయులు ఆనంద్, ఆర్ సాయిరామ్, ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల కోసం సామాజిక రక్షణ చట్టం తేవాలి

తాడేపల్లిరూరల్ : రజకుల కోసం సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలని, రజక సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించి నిధులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మేనిఫెస్టోలో తెలిపిన విధంగా రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని, కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేసి రజకుల అభివృద్ధి, సంక్షేమానికి ఆ నిధులు ఖర్చు చేయాలని కోరారు. మోడరన్ దోబీ ఘాట్లు ఏర్పాటు చేసి, ఆదరణ పథకం ద్వారా రజక వృత్తిదారుల, వృత్తి నిర్వహణకు అవసరమైన పరికరాలను వెంటనే అందజేయాలని విన్నవించారు. 50 ఏళ్లు దాటిన ప్రతి రజక వృత్తిదారునికి పెన్షన్ మంజూరు చేయాలని, రజకులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆయన ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

నరసరావుపేట టౌన్: భార్య ఆత్మహత్య కేసులో భర్త, అతని తల్లిదండ్రులను అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ సీఐ భాస్కర్ బుధవారం తెలిపారు. ఐలా బజార్‌కు చెందిన తాటి పల్లవి (22) భర్త పూర్ణచంద్రరావు అతని తల్లిదండ్రులు అంకమ్మరావు, పద్మావతిల వేధింపులు భరించలేక గత నెల 27వ తేదీన ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో నిందితును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు మంగళవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు వెల్లడించారు.

గారపాడులో ఇరు వర్గాల ఘర్షణ

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం గారపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ వర్గాల మధ్య మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఏడుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. గారపాడు గ్రామంలో నిత్యం వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్నికల పూర్తయిన దగ్గర నుంచి ఇప్పటివరకు వరకూ నిత్యం గ్రామంలో పోలీస్ పికెట్ నిర్వహిస్తూనే ఉన్నారు. పోలీస్ పికెట్ ఉన్నా వివాదాలు జరుగుతుండటం ఏమిటని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా వాటిని పోలీసులు అరికట్టి శాంతిభద్రతలను కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మైక్రో బయాలజీకి ఎన్ఏబీఎల్



మైక్రోబయాలజీ గుర్తింపు పత్రాలతో విభాగాధిపతి డాక్టర్ పరమేశ్వరి, డాక్టర్ ఇజ్రాయేల్

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల మైక్రో బయాలజీ వైద్య విభాగానికి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కలాబ్రేషన్ లేబరేటరీస్ (ఎన్ఏబీఎల్) గుర్తింపు మరోసారి లభించింది. గతంలో ఉన్న గుర్తింపును రెన్యూవల్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు అందాయి. ఎన్ఏబీఎల్ సర్టిఫికెట్ మైక్రోబయాలజీ విభాగానికి అందడంతో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, మైక్రోబయాలజీ వైద్యులకు అభినందనలు తెలిపారు. మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. పరమేశ్వరి, ఎస్ఆర్ఎల్ ల్యాబ్ ఇన్‌చార్జి, క్వాలిటీ మేనేజర్ డాక్టర్ ఇజ్రాయల్, మైక్రోబయాలజీ సిబ్బంది టి.ఓ.పవన్‌కుమార్, నాగేశ్వరరావు, ముస్తఫా, మేరి కుమారి, విజయరాణి, శ్రీనివాస్, సుబ్బారావు, విష్ణు, నాగరాజు, ఇతర సిబ్బందికి ప్రిన్సిపాల్, కళాశాల అధికారులు అభినందనలు తెలిపారు.

ఎమర్జెన్సీ చీకటి శకం



సన్మాన కార్యక్రమంలో ఎమర్జెన్సీలో జైలు జీవితం గడిపిన నేతలు

గుంటూరు మెడికల్: సిటిజన్స్ ఫోరం ఫర్ డెమోక్రసీ కన్వీనర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి సారథ్యంలో స్థానిక బ్రాడీపేటలోని మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థలో బుధవారం ఎమర్జెన్సీ వ్యతిరేక వారంలో భాగంగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీలో జైలు జీవితం గడిపిన నేతలను సన్మానించారు. సోషలిస్ట్ నేత మోదుగుల పాపిరెడ్డి, ఆర్ఎస్ఎస్ నేతలు మర్రిశంకరరావు, కొల్లిపర శివరామ్, న్యాయవాది పగడాల సాంబశివరావు, మున్నలూరి ఉపేంద్రగుప్తా, వీహెచ్‌పీ నేత చక్కా హరనాథ్‌లను, అజ్ఞానతంగా సేవలందించిన బీజేపీ నేత కొత్తూరు వెంకట సుబ్బారావు, ఏబీవీపీ నేత కోట బ్రహ్మయ్య, కిడాంభి దేవరాజ్‌లను సత్కరించారు. అనంతరం ముఖ్య వక్త, విద్యావేత్త, సంస్కారభారతి దక్షిణ భారత ప్రాంతీయ కార్యదర్శి ఖైరిశెట్టి మల్లికార్జునరావు మాట్లాడుతూ అధికార దుర్వినియోగం న్యాయస్థానంలో రుజువు కావటంతో తనను ఎవరు ప్రశ్నించరాదని అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారని గుర్తుచేశారు. ప్రతిపక్ష నాయకులను జైళ్లలో పెట్టడం, పత్రికా స్వేచ్ఛకు సంకెళ్ళు వేయటం, పౌర హక్కులను రద్దు చేయటం ద్వారా కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. ఇందిరా తనయుడు సంజయ్ గాంధీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లంటూ సాగించిన అమానుషాల వల్ల భారతదేశ పరువు ప్రపంచ దేశాల ఎదుట మంట కలిసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, డాక్టర్ కల్లగంటి నాగార్జున, ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, కంతేటి బ్రహ్మయ్య,పోకూరి జీతేంద్ర, జంధ్యాల రామలింగ శాస్త్రి, ఆవుల రాము, నడ్డి నాగ మల్లీశ్వరి,స్టాలిన్, డాక్టర్ స్రవంతి, మహాలక్ష్మి, వాణి నిర్మల, అంకాల శ్రీను, సురేష్ జైన్, వెంకట రమణ, సాధు రామకృష్ణ, పురుషోత్తం, నరేష్, కమల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి చెప్పారు. గుంటూరు మెడికల్ కాలేజీలో బుధవారం పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలకు 'సబ్ డిస్ట్రిక్ లెవెల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' ముగింపు సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. స్త్రీలలో బ్రెస్ట్, సర్వైకల్, నోటి క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించడం ఎలా అనే అంశంపై శిక్షణ పొందిన వారు ఇంటింటి సర్వేలో నిశితంగా కేసులను పరిశీలించి గుర్తించాలని ఆదేశించారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలకు సంబంధించిన ఆరు ప్రశ్నల పత్రాన్ని తీసుకు వెళ్లాలన్నారు. గృహ సందర్శనలో ప్రశ్నలు అడిగి క్యాన్సర్ కేసులను గుర్తించి చికిత్స కోసం రిఫర్ చేయాలని తెలిపారు. . కేసు తీవ్రతను బట్టి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆసుపత్రి, టీచింగ్ ఆసుపత్రులకు పంపాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ రాఘవేంద్ర పాటిల్, డాక్టర్ ఏ. శ్రావణ్ బాబు, డాక్టర్ చుక్క రత్నమన్మోహన్, డాక్టర్ ఈ. అన్నపూర్ణ, డాక్టర్ గిరిధర్ పాల్గొన్నారు.

పుట్టుకతో వచ్చే లోపాలు సత్వరమే గుర్తించాలి

పుట్టుకతో వచ్చే లోపాల్ని సత్వరమే గర్తించి చికిత్స అందించాలని డైక్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం డిఫెక్ట్స్, డిలేస్, డిసార్డర్స్, డిసీజెస్ అనే అంశాలపై వైద్యులకు, నర్సింగ్ సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈసందర్భంగా డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పసికందు మొదలు 18 సంవత్సరాల పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలపై వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. లోపాలను ఏవిధంగా గుర్తించాలనే విషయాలను వివరించారు. లోపాలు గుర్తించిన వారిని వైద్యం, ఆపరేషన్‌ల కోసం గుంటూరు జీజీహెచ్, తెనాలి జిల్లా ఆసుపత్రిలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డాక్టర్ కె.వి సుబ్బరాజు, డాక్టర్ ఈ. అన్నపూర్ణ, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ కీర్తి, ప్రతాప్ పాల్గొన్నారు.

చత్రపతి సాహు మహారాజ్ జయంత్యుత్సవం



చత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): 1902వ సంవత్సరంలో తన రాజ్యంలో బహుజనులకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన గొప్ప రాజు చత్రపతి సాహు మహారాజ్ అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. చత్రపత్తి సాహు మహారాజ్ జయంతిని పురస్కరించుకుని కాకుమాను వారితోటలోని యానాది కాలనీలో ఆయన చిత్రపటానికి బుధవారం రజక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూపూడి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చత్రపతి సాహు మహారాజ్ రాజ్యంలో చదువుకుని దేశానికి రాజ్యాంగం రాసే స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్ మాట్లాడుతూ సాహు మహారాజ్ స్ఫూర్తితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు నిడుముక్కల రాంబాబు, ఈమని ఉమామహేశ్వరరావు, నక్క రవి, వట్టికూటి సాంబయ్య పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి పవన్‌కుమార్

తెనాలిరూరల్: పిల్లలు విలువలతో కూడిన విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్ కుమార్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా తెనాలి మండలం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తెనాలి గంగానమ్మపేటలోని గుప్తా డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. న్యాయమూర్తి పవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు స్నేహాలకు ఆకర్షితులు కాకుండా విద్యపై దృష్టి పెట్టాలని, ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు కష్టపడాలని చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నేరమని చెప్పారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కృష్ణ, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ రమేష్, చిత్రంలో సీఐలు

తెనాలి రూరల్: వ్యసనాలను విడనాడాలని గంజాయి కేసుల్లో నిందితులు, సస్పెక్ట్ షీటర్లకు డీఎస్పీ ఎం. రమేష్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని తెనాలి పట్టణ, రూరల్, కొల్లిపర పోలీస్‌స్టేషన్‌లలో గంజాయి కేసుల్లో నిందితులకు టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిషేధిత మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత మాదక ద్రవ్యాల గురించిన సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. డీఎస్పీ వెంట వన్‌టౌన్‌సీఐ జి. దశరథరామారావు, టూ టౌన్ సీఐ ఎ. సుధాకర్, త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, రూరల్ సీఐ టి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ పి. కోటేశ్వరరావు, కొల్లిపర ఎస్ఐ రవీంద్రరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఎన్ఎస్ కెనాల్ ఎంప్లాయీస్ సమస్యలు పరిష్కరించాలి



ఈఈ మురళీధర్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

సత్తెనపల్లి: ఎన్ఎస్ కెనాల్ ఎంప్లాయీస్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శి కంబాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి ఓఅండ్ఎం డివిజన్ ఈఈ మురళీధర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో తాగునీటి చెరువులు సుమారు 1500 పైగా ఉన్నాయన్నారు. వీటి మెయింటెనెన్స్‌కు 1500 మంది లస్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆపరేటర్స్ అవసరం కాగా ప్రస్తుతం 400 మంది సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ మెయింటెనెన్స్‌కు 56 మంది అవసరం ఉండగా ప్రస్తుతం 10 మంది మాత్రమే పనిచేస్తున్నారని, ఎస్.ఎస్. డ్యామ్‌తో సహా 1100 మంది సిబ్బంది అవసరమన్నారు. ఆ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలో వర్క్‌చార్జ్‌డ్ సిబ్బందిని మెయింటెనెన్స్ సిబ్బందిగా ప్రభుత్వం గుర్తించిన దరిమిలా ఆ వ్యవస్థను రద్దుపరచి, ఉద్యోగుల జీతభత్యాలను 010 పద్దు ద్వారా చెల్లింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. పలు సమస్యలను వినతి పత్రంలో నమోదు చేసి పరిష్కరించాల్సిందిగా కోరారు. ఆయనతో పాటు ఏఐటీయూసీ సత్తెనపల్లి పట్టణ అధ్యక్షుడు డీఆర్ మస్తాన్, నాయకుడు నగేష్, పల్నాడు జిల్లా యువజన సంఘం నాయకుడు కె.ఆనంద్ తదితరులు ఉన్నారు.

జనవిజ్ఞాన వేదిక సభ్యత్వాల నమోదు

జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు



యడ్లపాడు: జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు ప్రక్రియను జూలై 15 నాటికి వివిధ విభాగాల ప్రతినిధులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు కోరారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ఈనెల 23న నెల్లూరు జిల్లాలో జరిగిన జేవీవీ రాష్ట్రస్థాయి సమావేశంలో భవిష్యత్ ప్రణాళికను ప్రకటించామన్నారు. డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేవీవీ చేపట్టే పలు కీలక కార్యక్రమాల్ని వెల్లడించారు. జేవీవీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చెకుముకి సంబరాలను ఆగస్టు 23న పాఠశాలస్థాయి, సెప్టెంబర్ 10న మండలస్థాయి, అదే నెల 29న జిల్లాస్థాయిల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 19, 20 తేదీల్లో విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జేవీవీ రాష్ట్ర వార్షిక మహాసభలు అనంతరంపురంలో సెప్టెంబర్ 15,16 తేదీల్లో ఉంటాయన్నారు. ఆయా కార్యక్రమాల్ని విజయవంతం చేసేందుకు జేవీవీ ప్రతినిధులు, సభ్యులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.